క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



ఎన్.చామవరంలో పత్తి పంటను పరిశీలించి రైతుకు సూచనలిస్తున్న ఏఓ అశోక్ కుమార్

తుని రూరల్: వరద నీటి ముంపునకు గురైన పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ సూచించారు. మండలంలోని ఎస్.అన్నవరం, ఎన్.చామవరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ముంపు బారిన పడిన పత్తి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలకు భూమిలో తేమ ఎక్కువైందన్నారు. దీంతో గులాబీ రంగు పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. ముందస్తుగా ఎకరాకు ఎనిమిది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. 75 రోజులకు ఐదు మిల్లీ లీటర్ల వేపనూనె లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పురుగుల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. పత్తి చేలల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

ప్రత్యూషకు డాక్టరేట్



హైదరాబాద్‌లో గీతం యూనివర్సిటీ డీన్ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న ప్రత్యూష

గండేపల్లి: మండలంలోని మురారి గ్రామానికి చెందిన చంద్రాల ప్రత్యూషకు గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని గీతం యూనివర్సిటీలో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె డాక్టరేట్ అందుకున్నారు. విశాఖపట్నం గీతం వర్సిటీలో ఇంప్లిమెంటేషన్ అండ్ పెర్ఫార్మెన్స్ ఇవల్యూషన్ ఆఫ్ ఎఫిసెంట్ ఆర్కిటెక్చర్ ఫర్ ఒన్ డైమెన్షనల్, టూ డైమెన్షనల్ ఫైన్‌ఇట్ ఇంపల్స్ ఫిల్టర్స్ అనే అంశంపై ప్రత్యూష పీహెచ్‌డీ చేశారు. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లోని సుమేధా ఐటీ సంస్థలో వీఎల్ఎస్ఐ డిజైన్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. గతంలో విశాఖలోని సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ, హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు, వీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేశారు. డాక్టరేట్ పొందిన ప్రత్యూషకు విశాఖ, హైదరాబాద్‌లోని పలు ఇంజినీరింగ్ కళాశాలల ప్రొఫెసర్లు, మురారి గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు



వీరలంకపల్లి బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈఓ వాసుదేవరావు

గోకవరం: వర్షాల కారణంగా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని వీరలంకపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల వసతి గృహం, గుమ్మళ్లదొడ్డిలోని జెడ్పీ హైస్కూల్, గోకవరంలోని ఎంపీయూపీ ఉర్దూ పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యాబోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా చూడాలన్నారు. పాఠశాలలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓలు బి.గౌరమ్మ, ఎం.చిమ్మరాజుదొర తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఏసు కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న గుడ్ ఫ్రెండ్స్ సంఘం సభ్యులు

గండేపల్లి: బాధిత కుటుంబానికి గుడ్ ఫ్రెండ్స్ చారిటీ సంఘం సభ్యులు చేయూతనందించారు. మండలంలోని తాళ్లూరుకు చెందిన మగ్గం ఏసు గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు పోగొట్టుకున్నాడు. ఇతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న గుడ్‌ఫ్రెండ్స్ చారిటీ సంఘం సభ్యులు శనివారం ఆ కుటుంబానికి బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఏసు కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నాగ చక్రం, సూర్యప్రకాష్, కల్యాణ్, అంజలి, ప్రభ, సుజాత, స్వీటీమాధురి, సుమ, ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేతలు జక్కిలింక రామకృష్ణ, బూర అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

ఆగిన వాన



ఏలేశ్వరం-నర్సీపట్నం రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

- మూడు రోజుల పాటు భారీ వర్షాలు
- పల్లపు ప్రాంతాలు జలమయం



వీరవరంలో నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న ఏఓ అమృత

తుని రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం శనివారం మధ్యాహ్నం తెరిపిచ్చింది. దీంతో ఆరుతడి పంటలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. మరోపక్క సాగునీటి వనరులలో నీటి నిల్వలు స్వల్పంగా పెరిగాయి. కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల్లో 15 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా 365.75 అడుగులకు నీటి నిల్వలు చేరాయి. తొండంగి, తుని మండలాలకు సాగునీరు అందించే పంపా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 105 అడుగులు కాగా 93.31 అడుగులకు నీటి నిల్వలు చేరాయి. అలాగే ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తదితర మండలాలకు సాగునీరు అందించే ఏలేరు రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 283.99 అడుగులకు 283.31 అడుగులకు నీటి నిల్వలు చేరాయి. మరిన్ని వర్షాలు కురిస్తే పంపా, తాండవ, ఏలేరు జలాశయాల్లో గరిష్ఠ నీటి నిల్వలు చేరే అవకాశాలు ఉన్నాయి. చిన్న, పెద్ద చెరువుల్లో సైతం వరదనీరు చేరింది. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వర్షపునీటితో తాండవ నదీ నుంచి సముద్రంలోకి వరద ప్రవహిస్తోంది. దీంతో తునికి ఎగువన, దిగువన ఉన్న రెండు మినీ రిజర్వాయర్లు కట్టడాలపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది.

రెండోరోజూ అదే తీరు

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో రెండోరోజూ శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం పడుతూనే ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బయటకు వచ్చేందుకు వీలులేకపోవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో రహదారులు నీటమునిగాయి. ఏలేశ్వరం ప్రభుత్వోన్నత పాఠశాల ప్రాంగణంలో వర్షపునీరు నిల్వ ఉండిపోయింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం బురదమయంగా మారింది. మండలంలోని లింగంపర్తి, జె.అన్నవరం, మర్రివీడు, తూర్పులక్ష్మీపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. మరో రెండురోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులు ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు.

నీట మునిగిన వరి చేలు

కిర్లంపూడి: గత మూడురోజులుగా ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వరి పంటలు నీట మునిగాయి. మండలంలోని సుమారు 80 ఎకరాల్లో వెదజల్లు, 12 ఎకరాల్లో నారుమడులు ఉన్నాయి. భూపాలపట్నం, వీరవరం, ముక్కొల్లు, సోమవరం, కిర్లంపూడి గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను ఏఓ జోకా అమృత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు రోజుల లోపు నారుమడిలో నీరు నిల్వ ఉంటే పూర్తిగా బయటకు తీసివేయాలన్నారు. అనంతరం 5 సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా, 1 కిలో పొటాష్ వేయాలని సూచించారు. పిలకలు దశలో వరి పంట నీటి మునిగితే నీరు తీసిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాస్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

275 హెక్టార్లలో పంట నీట మునక

గోకవరం: తుపాను ప్రభావంతో మండలవ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో 275 హెక్టార్లలో పంట నీట మునిగింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలోని చెరువుల్లోకి భారీగా నీరు చేరింది. గోకవరం, తంటికొండ, గాదెలపాలెం, కృష్ణునిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీట మునిగిన పంట పొలాలను ఏఓ రాజరాజేశ్వరి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే భారీ వర్షాలకు పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గోకవరం నుంచి తంటికొండ గ్రామానికి వెళ్లే మార్గంలో సప్టాపై ప్రమాదకరంగా వరద నీరు ప్రవహించింది. బురదకాలువ, ఊర కాలువల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

తెరిపిచ్చిన వర్షం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం శనివారం కాస్త తెరిపిచ్చింది. భారీ వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. పల్లపుప్రాంతాలు బురదయమంగా మారడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలుల ప్రభావానికి పలుచోట్ల విద్యుత్‌స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

ముంపు పొలాల పరిశీలన

గండేపల్లి: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో నీట మునిగిన వరి పొలాలను శనివారం పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దయాకర్, ఎఎస్ఆర్ శర్మ పరిశీలించారు. మురారిలో వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ ఎ.సద్గురుమూర్తి, వీఏఏ ఎన్ నాగదుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతులపై ప్రజావేదిక

- స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరిన ప్రజలు
- అంగీకారం తెలిపిన నిర్వాహకులు



క్వారీ నిర్వహణ ప్రాంతంలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో 5.87 హెక్టార్లలో నల్లరాయి క్వారీ నిర్వహణకు అనుమతి కోరుతూ మెస్సర్స్ శ్రీను కన్‌స్ట్రక్షన్స్ పేరుతో రౌతులపూడి గ్రామానికి చెందిన జిగిరెడ్డి మణికంఠ మోహన్ చేసుకున్న దరఖాస్తుపై అధికారులు శనివారం ప్రజావేదిక నిర్వహించారు. పర్యావరణశాఖ ఈఈ సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రజావేదికకు డీఆర్ఓ శ్రీరమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్వారీ నిర్వహణ ప్రాంతంలో ప్రజావేదిక నిర్వహించడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వకుండా కొండకోనల్లో చాటుమాటుగా ప్రజావేదిక నిర్వహించడం ఏమిటని స్థానికులు అధికారులను నిలదీశారు. పర్యావరణాన్ని దెబ్బతీయడంతో పాటు రహదారులు, తాగునీరు, వైద్యం వంటి ఇతర మౌలిక సదుపాయలు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా క్వారీ యజమానులు ఇష్టారాజ్యంగా క్వారీల నిర్వహణ చేపడుతున్నారని ఆరోపించారు. గతంలో క్వారీ యాజమాన్యాలు ఇదే తరహాలో ప్రజావేదిక కార్యక్రమాల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని పలవురు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పుడైనా క్వారీ నిర్వాహకులు స్థానిక యువతకు ఉపాధి, వైద్యం, రహదారుల నిర్మాణం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. దీనిపై క్వారీ నిర్వాహకుడు జిగిరెడ్డి మణికంఠ మోహన్ మాట్లాడుతూ నల్లరాయి క్వారీ నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలను తూ.చా.తప్పకుండా పాటిస్తానని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రహదారులు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటానని, స్థానిక యువతకు ఉపాధి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజావేదికలో స్థానికులు, ప్రజా సంఘాలు చేసిన ఫిర్యాదులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని డీఆర్ఓ శ్రీరమణి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

శంఖవరం: గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పర్వత రాజుబాబు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డయేరియా వాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకటరమణ, ఎస్సై ఐ.కిశోర్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల విస్తరణకు ప్రోత్సాహకాలు

తుని రూరల్: ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో రాయితీలు అందిస్తున్నట్టు ఏపీఓ పసుపులేటి నారాయణరావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉద్యాన పంటను బట్టి మూడేళ్లలో రూ.62,763 నుంచి రూ.రెండు లక్షలు వరకు రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. తుని మండలంలో 2024–25 సంవత్సరం నుంచి రెండు వందల ఎకరాల్లో ఉద్యాన పంటలకు ఈ రాయితీలు అందిస్తామన్నారు. ఇప్పటికే 63 ఎకరాలను గుర్తించామన్నారు. పండ్లతోటల సాగుకు రైతులను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటలకు అనుసంధానం చేసిందన్నారు. ఎకరాకు మామిడి (70 మొక్కలు) రూ.1,06,176, జీడి మామిడి (70 మొక్కలు) రూ.95,324, తీపి నారింజ (100 మొక్కలు) రూ.1,31,150, కొబ్బరి (60 మొక్కలు) రూ.92,704, చింత (40 మొక్కలు) రూ.65,763, సీతాఫలం (240 మొక్కలు) రూ.2,02,659, సపోట (60 మొక్కలు) రూ.92,704 అందించనున్నట్టు తెలిపారు. ఈ మొత్తాలను మూడేళ్లలో ఎరువులు, పురుగు మందులు, నిర్వహణకు అందించనున్నారు. అనుమతి పొందిన రైతులు మొక్కలను నాటుకుని ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన బిల్లులు జత చేయాలని సూచించారు. పరిశీలన అనంతరం ఆయా నిధులు నేరుగా రైతుల ఖాతాలకు జమవుతాయన్నారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ హోమం జరుగుతుందన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కాకరాపల్లిలో నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: యాజమాన్య పద్ధతులు అవలంభించడం ద్వారా ముంపుకు గురైన వరి నారుమళ్లను కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కాకరాపల్లి, కోటనందూరు, జగన్నాథపురం, టీజే నగరం, అల్లిపూడి, కేఏ మల్లవరం తదితర గ్రామాల్లో ముంపునకు గురైన వరి నారుమళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో సాగు చేసే 9,855 ఎకరాల వరిపంటకు సంబంధించి 250 ఎకరాల్లో వరి నారుమళ్లను సిద్ధం చేశారన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 150 ఎకరాల్లో నారుమళ్లు నీట మునిగినట్లు గుర్తించామన్నారు. విత్తనం చల్లిన రెండు నుంచి మూడు రోజుల వ్యవధిలో ఉన్న నారుమళ్లలో భారీగా నీరు చేరితే తొందరగా నీటిని తొలగించాలన్నారు. ఏడు నుంచి 20 రోజుల వ్యవధిలో ఉన్న నారుమడుల్లో నీరు చేరితే నీటిని తీసేసి ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేస్తే కొత్త ఆకులు వచ్చి ఊడ్పులకు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, వీఏఏలు పాల్గొన్నారు.

నేడు తలుపులమ్మతల్లికి శాకంబరి అలంకరణ



శాకంబరి అలంకరణకు కూరగాయలు సిద్ధం చేస్తున్న మహిళలు



అన్నవరం నేరేళ్లమ్మ తల్లి ఆలయంలో కూరగాయలతో మాలలు తయారు చేస్తున్న మహిళలు

తుని రూరల్: ఆషాఢమాసంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తలుపులమ్మ అమ్మవారికి శాకంబరి అలంకరణ చేయనున్నట్టు ఆలయ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు శనివారం తెలిపారు. రెండు టన్నుల కూరగాయలు, పండ్లతో అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను వేద పండితులు, ప్రధాన అర్చకులు పర్యవేక్షిస్తున్నారని, మహిళలు దండలు కడుతున్నారని చెప్పారు.

రత్నగిరిపై అమ్మవార్లకు..

అన్నవరం: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆదివారం రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు, గ్రామదేవత నేరేళ్లమ్మ వారికి కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేయనున్నట్టు ఆలయ అర్చకులు శనివారం తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి వరకూ అమ్మవార్లు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆలయాలను ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఈఓ కె. రామచంద్రమోహన్ ఆదేశించారు.

శాకంబరి అలంకరణకు కూరగాయల విరాళం

ఆషాఢ పౌర్ణిమ సందర్భంగా ఆదివారం రత్నగిరి దుర్గామాతలు, కొండదిగువన కొలువైన నేరేళ్లమ్మ అమ్మవారిని శాకంబరి అలంకరణ చేసేందుకు గాను విశాఖపట్నానికి చెందిన దాత ప్రసాద్ కూరగాయలు, ఆకుకూరలు విరాళంగా సమర్పించారు. వీటిని స్వచ్ఛంద సేవకులు మాలలుగా కట్టారు. ఆదివారం తెల్లవారుజామున ఈ కూరగాయలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయనున్నారు.

నేరేళ్లమ్మ అమ్మవారికి...

తొండంగి: అషాఢ మాసంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం గోపాలపట్నం గ్రామ దేవత నేరేళ్లమ్మ అమ్మవారికి శాకంబరి అలంకరణ చేయనున్నట్టు ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు. పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పిస్తామని చెప్పారు.

వెంకన్న ఆలయాలకు భక్తుల తాకిడి

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండలో వెంకటగిరి కొండపై స్వయంభూ వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డిలో పుట్టలో వేంచేసిన వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.